తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 189
పేజీలు : 6
వెల : 4
మల్కాజిగిరి
శనివారం 17-02-2024

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్ లో నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలను కుంటున్నారా?
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com,
www.jayabheridaily.com
Call me: 9391 544 889



# ఇంటి.. ఇంటికి మేడారం ప్రసాదం

**జయభేరి, వరంగల్, ఫిబ్రవరి 16:**

మేడారం సమ్మక్కసారలమ్మ జాతర... తెలంగాణ లోనే అతిపెద్ద జాతర. కుంభమేళా తరువాత దేశంలో జరిగే అతి పెద్ద జాతర. రెండేళ్లకోసారి మాఘమాసంలో నాలుగు రోజులపాటు కన్నుల పండువగా జరుగుతుందీ గిరిజనుల జాతర. ఈ వేడుకకు హాజరై మొక్కులు చెల్లించుకుంటే సర్వ శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆసియాలోనే అతి పెద్ద జాతరగా గుర్తింపు పొందిన ఈ వేడుకను చూసి తరించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలే కాదు... ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు తరలి వస్తారు. సమ్మక్కసారలమ్మను దర్శించుకుని... నిలువెత్తు బంగారం సమర్పించుకుంటారు. దాదాపు కోటి మంది వరకు ఈ జారతకు హాజరవుతారు. కానీ... కొన్ని కారణాల కారణంగా... జాతరకు వెళ్లలేని వారు ఎంతో మంది. జాతరను కళ్లారా చూడలేకపోయినా... అమ్మవార్ల మహా ప్రసాదం అయితే దక్కితే చాల నుకునే వారు చాలా మంది ఉంటారు. ఇలాంటి వారి కోసం శుభవార్త చెప్పింది తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ. జాతరకు వెళ్లలేకపోయిన వారికి కూడా మేడారం సమ్మక్కసారలమ్మ ప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేసింది టీఎస్ఆర్టీసీ . ఆన్లైన్లో బుక్ చేసుకుంటే చాలు.. మేడారం జాతర ప్రసాదాన్ని మీ ఇంటి ముందుకే తెచ్చిస్తామంటోంది. ఇందు కోసం దేవాదాయ శాఖతో టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దేవస్థానం నుంచి అమ్మవార్ల ప్రసాదంతో పాటు పసుపు, కుంకుమను భక్తుల ఇళ్ల దగ్గరకే అందజేయనుంది టీఎస్ఆర్టీసీ.

2 లో

# కులగణనకు అసెంబ్లీ తీర్మానం



**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 16**

బీసీ కులగణన విషయంలో ఎలాంటి అపోహలొద్దని.. బలహీన వర్గాలను బలోపేతం చేయడమే తమ ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీసీ కులగణనపై శుక్రవారం అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ సందర్భంగా.. ఈ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదని అన్నారు. మంచి కార్యక్రమం చేపట్టాలనే ఉద్దేశంతోనే ఈ తీర్మానాన్ని సభ ముందుకు తెచ్చామని వెల్లడించారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బయటపెట్టారా.? అని ప్రశ్నించారు.తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బీసీ కులగణనపై మంత్రివర్గంలో తీర్మానం ప్రవేశపెట్టామని.. ఎవరూ అడగకుండానే సభలో ప్రవేశపెట్టామని సీఎం రేవంత్ అన్నారు. పాలితులుగా ఉన్న వారిని పాలకులుగా చేయడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించి వాళ్ల ఆర్థిక ప్రయోజనాలను నిలబెట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు. 'కులగణనపై చర్చను ప్రతిపక్షం తప్పుదోవ పట్టిస్తోంది. కులగణనను అమలు చేసే క్రమంలో న్యాయ, చట్టపరమైన చిక్కులపై అనుమానం ఉంటే సూచనలివ్వండి. అంతేకానీ, తీర్మానానికే చట్టబద్ధత లేదన్నట్లుగా మాట్లాడడం మనందరికీ మంచిది కాదు. మేం రహస్యంగా ఏమీ చేయడం లేదు. ఈ తీర్మానంపై రాష్ట్ర జనాభాలో అరశాతం ఉన్న వాళ్లకు బాధ ఉండొచ్చు. రాష్ట్రాన్ని గుప్పిట్లో పెట్టుకున్నాం. లెక్కలు బయటకు వస్తే 50 శాతం జనాభా ఉన్న వాళ్లకు రాజ్యాధికారంలో ఎక్కడ భాగం

2 లో



# ఇస్రో మరో ప్రయోగం

**జయభేరి, శ్రీహరికోట, ఫిబ్రవరి 16**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమవుతోంది. షార్ కేంద్రంలోని రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్వీ ఎఫ్14 రాకెట్ను ప్రయోగించనున్నారు. షార్లోని బ్రహ్మ ప్రకాష్ హాలులో మిషన్ రెడీనెస్ రివ్యూ(ఎంఆర్ఆర్)ను గురువారం అధికారులు నిర్వహించారు. అనంతరం ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు(ల్యాబ్)కు అప్పగించారు. అనంతరం లాంచ్ ఆథరైజేషన్ బోర్డు ఛైర్మన్ అర్ముగం రాజ రాజన్ ఆధ్వర్యంలో మరోసారి ల్యాబ్ సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలు నుంచి 27.30 గంటల కౌంట్ డౌన్ అనంతరం జీఎస్ల్వీ14ను ప్రయోగించనున్నారు. మొత్తం 2,272 కిలోలు బరువు కలిగిన ఇన్శాట్ 3డీఎస్ ఉపగ్రహాన్ని భూమికి 36 వేల కిలో మీటర్లు ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టేలా ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని డిజైన్ చేశారు. షార్ కేంద్రం నుంచి ఇప్పటి వరకు అనేక ప్రయోగాలను ఇస్రో నిర్వహించింది. తాజాగా ప్రయోగిస్తున్న జీఎస్ఎల్వీ ఎఫ్14 ఇక్కడ నుంచి జరుగుతున్న 92వ ప్రయోగం. జీఎస్ఎల్వీ సిరీస్లో 16వ ప్రయోగం పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజన్లు తయారు చేసుకుని చేస్తున్న పదో ప్రయోగం ఇది.

# కాంగ్రెస్ గూటికి పలువురు నేతలు



**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 16**

లోక్ సభ ఎన్నికలకు ముందు తెలంగాణలో రాజకీయాలు ఊపందుకున్నాయి. ఇన్నాళ్ళ పార్టీ జాయినింగ్స్పై మౌనంగా కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు హస్తం గూటికి చేరారు. కాంగ్రెస్లో కీలక నేతల చేరికలతో రాజకీయ పరిణామాలు ఏ విధంగా మారబోతున్నాయనే అంశం ఆసక్తికరంగా మారింది. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సతీమణి, వికారాబాద్ జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీకాంగ్రెస్ ఇన్చార్జ్

..మిగతాది 2 లో

# ఈటెల మౌనం వ్యూహం ఏమిటో..

**జయభేరి, కరీంనగర్, ఫిబ్రవరి 16:**



బీజేపీలో సీనియర్ నేత ఈటల రాజేందర్ పై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. మల్కాజిగిరి పార్లమెంట్ టిక్కెట్ కోసం ఆయన పట్టుబడుతున్నారని ఇవ్వకపోతే పార్టీకి గుడ్ బై చెప్పడానికి కూడా రెడీగా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయారు. ఆయన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం మొదలైంది. దీంతో ఈటెల రాజేందర్ దేశంలోనే అతి పెద్ద మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై గురిపెట్టారని తెలుస్తోంది. మరోవైపు ఈటలతో పాటు బీజేపీ నుంచి ఆ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేయాలని నేతలు క్యూ కడుతున్నారు. అయితే నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో బీజేపీ అధిష్టానం అభ్యర్థి ఎంపికపై సీనియర్ నేత పైడి రాకేష్ రెడ్డికి పార్లమెంట్ ఇన్చార్జి బాధ్యతలు ఇది వరకే అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన ఈటల.. తీవ్ర పోటీ ఉన్న ఈ మల్కాజిగిరి పార్లమెంట్ పైనే గురిపెట్టడంతో పార్టీలోని ఇతర ఆశావాహులకు నచ్చడం లేదు. అధిష్టానం ఈ పార్లమెంట్లో గెలవాలని భావించి.. ఫోకస్ పెంచింది. ఈ అక్కడే పోటీ చేసేందుకు నేతలు క్యూ కడుతున్నారు. రెండు చోట్ల ఓడిపోయిన ఈటల ఈ స్థానం కాకుండా మెదక్ ఇతర స్థానాల్లో పోటీ

..మిగతాది 2 లో

# ఢిల్లీకి సూట్ కేసులు మోస్తున్న కాంగ్రెస్

- రాహుల్ గాంధీ కోసం బిల్డర్లను బెదిరిస్తున్నది: కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్:**



ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి సూట్ కేసులు మోస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ రాహుల్ గాంధీ కోసం కాంట్రాక్టర్లను, బిల్డర్లను, కంపెనీలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నదని అన్నారు. మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కర్నాటక నుంచి సూట్ కేసులు వస్తే.. ఇప్పుడు తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వైసీపీ నాయకులు వెళ్లల రామ్మోహన్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది కానీ అమలు చేయడం లేదు. ఢిల్లీకి సూట్ కేసులను మోసే పనిలో ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటక నుంచి ఇక్కడికి సూటు కేసులు వచ్చాయి. రాహుల్ గాంధీ కోసం తెలంగాణలో బిల్డర్ల దగ్గర, కంపెనీలు, కాంట్రాక్టర్లను కాంగ్రెస్ బెదిరిస్తున్నది. ఆ పార్టీ నేతల మాటలు కోటలు దాటుతాయి కానీ.. ఆరు గ్యారంటీల అమలు లేదు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ లా కాదు.. చేసేదే చెప్తుంది.. చెప్పేది చేస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన పీవీ నర్సింహారావును మోదీ ప్రభుత్వం గౌరవించింది. పీవీ చనిపోతే.. ఆయన పార్థీవ దేహాన్ని ఏఐసీసీ ఆఫీసులోకి అప్పటి కాంగ్రెస్ పార్టీ రానియ్యలేదు. ఆయనకు స్మృతి వనం నిర్మించలేదు. ఢిల్లీలో అంత్యక్రియలు నిర్వహించనీయలేదు. పార్థీవ దేహాన్ని హైదరాబాద్ కు పంపిన చరిత్ర కాంగ్రెస్ ది. ఆయన కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి అయినా.. మోదీ ప్రభుత్వం పీవీ సేవలను గుర్తించి ఆయనకు భారత రత్న ఇచ్చింది"అని స్పష్టం చేశారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి

**నల్గొండ :**



నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ లచ్చు నాయక్ మూడు లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయాడు. మెడికల్ డిస్ట్రిబ్యూటర్ రాపోలు వెంకన్న నుండి బిల్లు విషయంలో ఇంట్లోనే రూ. 3లక్షలు లంచం తీసుకుంటూ ఎసీబీకే ఇంట్లో రెడ్ హ్యాండెడ్ గా చిక్కాడు. బిల్లు విషయంలో సూపర్డెంట్ లచ్చు నాయక్ ఇబ్బంది పెట్టడంతో ముందుగానే ఏసీబీ అధికారులను కాంట్రాక్టర్ కలిసాడు..

jayabheridaily.com
ప్రభాత జయభేరి

## అసెంబ్లీ తీర్మానం

తెలంగాణ అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రవేశ పెట్టారు. దీనిపై మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. కులగణన చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటిని, కులాన్ని సర్వే చేసి.. ప్రజల ఆర్థిక స్థితి గతులు తెలుసుకుంటామని అన్నారు. సర్వేలో అన్ని వివరాలు పొందు పరుస్తామని.. సర్వ రోగ నివారిణిలా సర్వే ఉంటుందని పేర్కొన్నారు. కాగా, కులగణనను తాము ఆహ్వానిస్తున్నట్లు బీఆర్ఎస్ నేత కడియం తెలిపారు. 'అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానం ప్రవేశ పెట్టడం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం. దేశంలోని సంపద, రాజ్యాధికారం జనాభా దామాషా ప్రకారం దక్కాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందు కోసమే ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే కుల గణన చేస్తామని చెప్పాం. రాష్ట్రవ్యాప్తంగా కులగణనతో పాటు సోషల్, ఎకానమిక్, ఎడ్యుకేషన్, పొలిటికల్, ఎంప్లాయిమెంట్ అంశాలపై సర్వే చేస్తాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటిని, అన్ని కులాలు, ఆర్థిక స్థితిగతలపై సర్వే నిర్వహిస్తాం. ఈ సర్వే ద్వారా సంపదను అన్ని వర్గాలకు జనాభా దమాషా ప్రకారం ఎలా పంచాలన్న దానిపై ప్రణాళికలు తయారు చేస్తాం. సామాజిక ఆర్థిక రాజకీయ మార్పునకు పునాదిగా తెలంగాణ మారబోతుంది.' అని భట్టి తెలిపారు. అసెంబ్లీలో కులగణన తీర్మానాన్ని తాము స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. కానీ, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తీర్మానంలో స్పష్టత లేదని.. దీనిపై క్లారిటీ ఇవ్వాలని అన్నారు. 'జనం, కులం అంటూ ద్వంద్వ వైఖరి కనిపిస్తోంది. జనగణన చేసే హక్కు రాష్ట్రాలకు లేదు. కులగణన మాత్రమే చేసే హక్కు ఉంటుంది. తీర్మానానికి చట్ట బద్ధత అయినా కల్పించాలి. లేదా న్యాయపరంగా అయినా ముందుకు వెళ్లాలి. ఎలాంటి చట్ట బద్ధత లేకుండా తీర్మానం పెడితే లాభం ఉండదు. కులగణన చేపట్టిన ఆయా రాష్ట్రాలు న్యాయపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.' అని పేర్కొన్నారు. దీనిపై మంత్రి పొన్నం సమాధానమిచ్చారు. బీసీ కులగణనపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని.. ప్రతిపక్షాలకున్న సందేహాలు నివృత్తి చేసే బాధ్యత తమదే అని స్పష్టం చేశారు. ఏమైనా సలహాలు, సూచనలు ఉంటే ఇవ్వొచ్చని.. దానిపై ప్రత్యేక చర్చ చేయండి అంటూ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. అయితే, పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వానికి సూచించారు. తీర్మానం కాదు చట్టం చేయాలని అన్నారు.

## కాంగ్రెస్ గూటికి

దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆమెతో పాటు కంచర్ల చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ హస్తం గూటికి చేరారు. చేవేళ్ల లోక్సభ సీటుపై హామీతోనే పట్నం సునీతా మహేందర్ రెడ్డి కాంగ్రెస్లో చేరారనే వార్తలు వినిపిస్తున్నాయి. చేవేళ్ల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ తరపున బలమైన అభ్యర్థులు బరిలో ఉండటంతో.. కాంగ్రెస్ కూడా నియోజకవర్గంపై పట్టున్న పట్నం ఫ్యామిలీని రంగంలోకి దింపాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పలు దఫాలు చర్చలు జరిపిన పట్నం కుటుంబసభ్యులు ఎట్టకేలకు ఎంపీ సీటు కోసం లైన్ క్లియర్ కావడంతో సునీతా రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్కు కాంగ్రెస్ ఏ విధమైన హామీ ఇచ్చిందనే అంశం కూడా ఆసక్తికరంగా మారింది. బొంతు రామ్మోహన్ సికింద్రాబాద్ లేదా మల్కాజ్గిరి లోక్ సభ సీటు ఆశిస్తున్నట్టు సమాచారం. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఎంపీ సీటుపై ఏ విధమైన హామీ ఇచ్చిందన్నదీ ఆసక్తికరంగా మారింది. అయితే టీకాంగ్రెస్ ఇన్ఛార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు రామ్మోహన్. కాంగ్రెస్లో చేరిన మరో నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి సైతం మల్కాజ్గిరి నుంచి ఎంపీగా పోటీ చేయాలని భావిస్తున్నారు. టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ స్వయాన మామ అయిన చంద్రశేఖర్ రెడ్డి, గతంలో బీఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయితే ఆయనకు బీఆర్ఎస్ తరపున పోటీ చేసే అవకాశం రాలేదు. తాజాగా ఆయన కాంగ్రెస్ గూటికి చేరడంతో ఆయనకు సీటు విషయంలో హస్తం పార్టీ ఏ రకమైన హామీ ఇచ్చిందనే అంశంపై చర్చ జరుగుతోంది. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వికారాబాద్ జడ్ పి చైర్మన్ పట్నం సునీతా మహేందర్ రెడ్డి కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బొంతు రామ్మోహన్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్ని బిఆర్ఎస్ నుంచి హైదరాబాద్ మేయర్ గా సేవలందించారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఉప్పల్ నియోజకవర్గం సీటు ఇవ్వాలని బిఆర్ఎస్ అధిష్టానాన్ని అడిగినా ఆయనకు టికెట్ దక్కలేదు. దీంతో బిఆర్ఎస్ కు గుడ్ బై చెప్పి బొంతు కాంగ్రెస్ లో చేరారు. జవహర్ నగర్ మేయర్ మేకల కావ్య కూడా కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నారు.

## ఈటెల మౌనం

చేయాలని ఆయకు పార్టీ నేతలు సంకేతాలు పంపుతున్నట్లు సమాచారం. ఈటల రాజేందర్ మాత్రం ఇవేవి పట్టించుకోకుండా మల్కాజ్గిరిలో ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కార్యక్రమాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ అధిష్టానానికి సంకేతాన్ని పంపుతున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకునేందుకు ఆయన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'ఈటల ఫర్ మల్కాజ్గిరి' క్రికెట్ ట్రోఫీని ఆయన అనుచరులు స్టార్ట్ చేశారు. అయితే దీనికి సంబంధించిన పోస్టర్ రిలీజ్ కూడా స్వయంగా తన నివాసంలో ఈటల రాజేందర్ రిలీజ్ చేశారు. ఈటలకే మల్కాజ్గిరి టికెట్ రాబోతున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. దీంతో మరోసారి ఈటల దుమారం తెరపైకి వచ్చింది. ఎంపీగా పోటీపై బీజేపీ అధిష్టానం నిర్ణయం కంటే ముందే అనుచరుల పేరుతో తానే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారని పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై పార్టీ నేతలు హైకమండ్ కు పిర్యాదులు చేశారు. ఇప్పటికి హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

## మేడారం ప్రసాదం

ఇందు కోసం ఆన్లైన్ బుకింగ్ కూడా ప్రారంభించింది. ఈనెల 21 నుంచి 24 వరకు మేడారం జాతర జరగనుంది. దీంతో నిన్నటి నుంచే ప్రసాదం బుకింగ్ చేసుకునే అవకాశన్ని భక్తులకు కల్పించింది టీఎస్ఆర్టీసీ. ఈనెల 25 వరకు ప్రసాదం బుకింగ్ సేవలు కొనసాగనున్నాయి. ఆన్లైన్లో గానీ.. ఆఫ్లైన్లో గాని.. ప్రసాదాన్ని బుక్చేసుకోవచ్చు. ఆఫ్లైన్లో అయితే... టీఎస్ఆర్టీసీ కార్గో కౌంటర్లలో గానీ... పీసీసీ ఏజెంట్ల దగ్గర గానీ.. రూ.299 చెల్లించి మేడారం ప్రసాదాన్ని బుకింగ్ చేసుకోవచ్చు. ఆన్లైన్ అయితే... https://rb.gy/q5rj68 లింక్పై క్లిక్ చేయాలి. లాదే... పేటీఎం ఇన్ సైడర్ యాప్లోనూ అమ్మవార్ల ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చు. ప్రసాదం బుకింగ్ సదుపాయం తెలంగాణలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. మేడారం జాతర అయిపోయిన తర్వాత... బుక్ చేసుకున్న వారి ఇంటికే ప్రసాదాన్ని అందజేస్తామని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని లాజిస్టిక్స్ (కార్గో) కౌంటర్లలో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. పీసీసీ ఏజెంట్స్తో పాటు డిపోల పరిధిలో విధులు నిర్వర్తించే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్లను సంప్రదించి ప్రసాదాన్ని ఆర్డర్ ఇవ్వవచ్చని చెప్పారు. ఆన్లైన్లో ప్రసాదం బుక్ చేసుకునే భక్తులు... వారి అడ్రెస్, పిన్ కోడ్, ఫోన్ నంబర్ను తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. మేడారం ప్రసాద బుకింగ్కు సంబంధించిన పూర్తి వివరాల కోసం కాల్ సెంటర్ నెంబర్లు 04069440069, 04069440000, 040 23450033 సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.

## అసెంబ్లీ తీర్మానం

ఇవ్వాల్సి వస్తుందోనన్న బాధ ఉంటుందేమో.?. ఇప్పటికైనా ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రావాలి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్తశుద్ధిపై మాకు ఎలాంటి అనుమానం లేదు. కానీ సహవాస దోషం అన్నట్టుగా కొంతమంది పక్కన కూర్చోవడంతో ఆయన్నూ తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇంత మంచి తీర్మానం చేసినప్పుడైనా దాన్ని స్వాగతించి సూచనలు చేయాల్సిందిగా కోరుతున్నాం. సహేతుకమైన సూచనలను మేం పరిగణలోకి తీసుకుంటాం.' అని రేవంత్ స్పష్టం చేశారు. కులగణనపై ప్రజలకు అనుమానం లేవనెత్తేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. చట్ట సభల్లో అన్ని కులాలకు న్యాయం చేసేందుకు కులగణన ప్రక్రియ చేపట్టామని అన్నారు. దీనిపై మాకు ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవని.. గతంలో కాంగ్రెస్ హయాంలో జస్టిస్ కమిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే చేశామని గొప్పలు చెప్పుకొనే బీఆర్ఎస్ నేతలు.. ఆ సర్వేను సభలో ప్రవేశ పెట్టారా.? అని నిలదీశారు. 'మేనిఫెస్టోలపై ఓ రోజు చర్చిద్దాం. 2014, 2018, 2023లో పార్టీల మేనిఫెస్టోలపై ప్రత్యేకంగా చర్చిద్దాం. ఈ పదేళ్లు మీరేం చేశారు.

# సుప్రీం ఆదేశం.. ఎన్నికల బాండ్లు బయట పెట్టాల్సిందే..

## తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు

**దేశ రాజకీయాల్లో సంచలనం రేకెత్తిస్తున్న అంశం. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ స్పూర్తికి విరుద్ధం అంటూ విరాళాల ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచొద్దంటూ సుప్రీంకోర్టు కరాకండిగా తేల్చేసింది. అయితే రాజకీయ నాయకులకు విరాళాలు అప్పనంగా అప్పజెప్పే వారి కంపెనీలకు ఇన్కమ్ టాక్స్ పన్ను రాయితీ ఇవ్వకూడదు అనేది ప్రధాన అంశం... ఈ విషయంపై జయభేరి కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సమగ్ర రాజకీయ విశ్లేషణ....**




**జయభేరి, హైదరాబాద్ :**
భారతదేశం ప్రపంచ దేశాల్లో కెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యం దేశ పౌరుల్లో బలమైన నమ్మకాన్ని కలిగించే విధంగా ప్రతి వ్యక్తికి ప్రాథమిక హక్కులు కల్పించింది రాజ్యాంగం. అయితే ప్రజాస్వామ్యంలో ప్రజలే బాసుగా అభివర్ణించే స్వతంత్ర భారతావనిలో తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడు రాజకీయ నాయకులకు విరాళాలు ఇచ్చే బడా బడ కార్పొరేట్ పెద్దలకు మింగుడు పడడం లేదు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులు ప్రజలకు సేవ చేయడానికి స్వచ్ఛందంగా వస్తారు. మరి అలాంటి వారు ప్రజలకు జవాబు దారితనంగా ఉండాలి. అప్పుడు ప్రజాస్వామ్యం అని పిలవబడుతుంది. కానీ వాస్తవ పరిస్థితులు ప్రజాస్వామ్యంలో ఏంటి అని ఒక్కసారి మనకి మనమే ప్రశ్న వేసుకుంటే రాజకీయాలలో తనదైన ముద్రను ఏర్పరచుకోవడానికి కరుడుగట్టిన నేరస్తులు గూండాలు రౌడీయిజం చేసే వాళ్ళు రాజకీయాల్లోకి వచ్చి తమ దగ్గర ఉన్న డబ్బులు ఇరగ వేసి అలాగే సమాజంలో ఉన్న బడాబడా కంపెనీల యజమానులను బెదిరించి వారి దగ్గర నుంచి విరాళాలు సేకరించి ప్రజలకు డబ్బు ఎర చూపించి అధికారాన్ని చేజిక్కించుకుంటున్నారు. ఇలా అధికారం చేజిక్కించుకున్న వాళ్లు ప్రజల కోసం పని చేయరు. వారు పోగొట్టుకున్న డబ్బులు తిరిగి సంపాదించుకోవడానికి అలాగే విరాళాలు ఎవరైతే ఎక్కువ మొత్తంలో ఇస్తారు వారికి అనుబంధంగా ఆదేశాలు ఆర్డినెన్స్లు చట్టాలు చేయడానికి నాయకులు పాకులాడుతుంటారు, వెంపర్లాడుతుంటారు. ఇంకోవైపు దేశంలో నల్లధనాన్ని బయటకి తీస్తా అది ప్రజలకు పంచుతాం అని చెప్పుకొచ్చిన కేంద్ర బిజెపి నేతలు ఆ దిశగా ఎంతవరకు పని చేశారో ఏమో తెలియదు కానీ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రకారం చూస్తే రాజకీయ పార్టీలు ప్రధాన భూమిక పోషించేది నల్లధనం పెడుతున్న వారే కావడం కోసం కొస మెరుపు...


సమాజంలో కుబేరులుగా ఉన్న కార్పొరేట్ పెద్దలు ప్రభుత్వాలని శాసించే విధంగా తీవ్రంగా ప్రభుత్వ విధివిధానాలపై ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే వారు పార్టీ గెలుపు కోసం భారీ మొత్తంలో విరాళాలు అందిస్తారు కనుక వారికి ఆ విరాళాల పై పన్ను రాయితీ కూడా కల్పించే ప్రభుత్వాలు ఉంటున్నాయి కనుక ప్రభుత్వ విధివిధానాలు కార్పొరేట్ వ్యవస్థలకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అలాంటప్పుడు ప్రజలకు సేవ చేసే అవకాశం ఏ కోశానా కనిపించదు. రాజకీయాలలో ఏ మచ్చ లేకుండా తనదంటూ రాజకీయ జీవిత చరిత్రను లిఖించుకున్న రాజకీయ పెద్దమనిషి దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్పేయి. ఆయన రాజకీయాల్లో ఎప్పుడూ ఒక మాట అంటుండేవారు. రాజకీయంలో జీవితాన్ని అబద్ధంతో ప్రారంభిస్తున్నాం అని వాజ్పేయి గారు అన్న మాటలు ఈనాటికి సజీవంగానే ఉంటున్నాయి. అబద్ధపు పునాదుల మీదనే రాజకీయ ముఖచిత్రం జడలు విప్పుకుంటుంది అనడానికి ఎలాంటి సందేహం లేదు. రాజకీయ పార్టీలకు కంపెనీలు వ్యాపారస్తులు బడబడ కార్పొరేటర్లు ఇచ్చే ఎలక్ట్రో బాండ్లను సుప్రీంకోర్టు కచ్చితంగా ప్రజల ముందుకు తీసుకురావాలి బహిర్గతం చేయాలి అనే తీర్పు ఇవ్వడంతో విరాళాలు ఇచ్చిన వాళ్లు ఇప్పుడు నాన్నయాతన పడుతున్నారు. అధికార పార్టీకి విరాళాలు ఇచ్చిన మేము బయటికి తెలిస్తే మా భవిష్యత్తుకు పోలీస్ స్టాప్ పడుతుంది అనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి.

2017 ఆర్థిక చట్టం ప్రకారం బహిర్గతం చేయకూడదు అనే చట్టాన్ని రాజకీయ నాయకులు అవసరానికి ఆర్థిక చట్టంలో పొందుపరిచారు తప్ప ప్రజల క్షేమాన్ని గురించి ఈనాడు ఆలోచించలేదు. ఎందుకంటే రాజకీయ పార్టీలకు భారీ మొత్తంలో నగదు రూపంలో ఇచ్చే బడబడ కంపెనీలు కార్పొరేట్ వ్యవస్థలు ఈ దేశ ని పరిపాలించే రాజకీయ నాయకులనే శాసిస్తున్నారు. ప్రజల ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలు ప్రభుత్వాలుగా ఏర్పడి ప్రజలకు సేవ చేయాలి. అంతేకానీ కార్పొరేట్ కనుసన్నలో రాజకీయాన్ని నడిపిస్తూ వారికే పెద్దపీట వేయడాన్ని ఎవరు సమర్థిస్తారు ఏ రాజ్యాంగం ప్రకారం ఇలా నడుస్తుంది అన్న సందేహాలపై సుప్రీంకోర్టు విరాళాలు ఇచ్చే ఎన్నికల బాండ్లను కచ్చితంగా బహిర్గతం చేయాలనే తీర్పును వెలువరించింది.

ప్రభుత్వాలకు విరాళాలు ఎన్నికల బాండ్లను ఇచ్చిన ఆయా కంపెనీలు గరిష్ట పరిమితిని తీసేసి లిమిట్ లేకుండా ఎక్కువ విరాళాలు ఇచ్చి అవి ఆడిట్లో లేకుండా ఉండేట్టుగా చూసుకొని పన్ను రాయితీని ఎగబడుతున్న సందర్భాలు అనేకంగా ఉన్నాయి. పేదవాడి పై నడ్డి విరిచే పన్నులు వసూలు చేస్తున్న ఈ ప్రభుత్వాలు బడాబడా కంపెనీలు ఫార్మా కంపెనీలపై ఎందుకు పన్ను రాయితీని తీసేస్తుంది అనే విషయంపై తీవ్రమైన ఆలోచన చర్చే జరిగి చివరికి అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల బాండ్లను బయటపెట్టాల్సిందే విరాళాలు అందించిన వారు ఎవరు పేర్లు కచ్చితంగా ప్రజల ముందు.. విరాళాలు అందించిన దాతల పేర్లు ప్రకటించాలని తీర్పు ప్రకటించింది. ఒకానొక సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి ఎలక్ట్రోల్ బాండ్ల ద్వారా 16 వేల కోట్ల విరాళాలు అందించింది ఒక కార్పొరేట్ కంపెనీ అంటే ఇచ్చి పుచ్చుకునే విధానానికి తెరతీసి ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాలు కనుమరుగైపోయి కార్పొరేట్ కంపెనీల కోసమే పని చేసే ప్రభుత్వాలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి..

ఇతర దేశాల్లో ప్రజాస్వామ్యం లేదు గనుక అమెరికా జర్మనీ ఇలాంటి దేశాల్లో 1000 డాలర్ల కంటే ఎక్కువగా ఇచ్చిన దాతలు భారం పడుతుంది. అదే జర్మనీలో చట్టబద్ధంగా ఖర్చు చేస్తారు... విరాళాలు తీసుకున్న ఖర్చు పెట్టిన ఆదేశ చట్ట ప్రకారంగా ఖర్చు పెడుతూ ప్రజలకు పూర్తి విరాళాలను అందుబాటులో ఉంచుతారు. కానీ ఒకనాడు జర్మనీలో ఒక అధ్యక్షుడు ఆ విరాళాలు ఏమి చెప్పకుండా కొన్ని కోట్ల నిధులతో ఖర్చు చేసి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత అక్కడి న్యాయస్థానాలు ఆ దేశాధ్యక్షుడు ఇంటిని ఆస్తిని స్వాధీనం చేసి ప్రజలకు లెక్కలు చెప్పాయి... అంటే ఆ దేశ చట్టం ప్రకారం కచ్చితంగా ప్రజలకు ఎవరు ఎవరు ఎంత విరాళాలు అందిస్తున్నారు కచ్చితంగా లెక్క చెప్పే వెలుసుబాటు అక్కడ ఉంది. అలానే మన భారతదేశంలో కూడా ఇన్కమ్ టాక్స్ మినహాయింపు కోరుకునే ఆయా బడా బడా కంపెనీల అసలు తతంగాన్ని బయటకు తీసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎవరెవరు పరిధిలో ఎంత విరాళాలు ఎన్ని కోట్లలో ఇస్తున్నారనే విషయాన్ని గోప్యంగా ఉంచకుండా ఖచ్చితంగా బయట పెట్టాల్సిందే అంటూ సుప్రీమ్ హుకుమ్ ను జారీ చేసింది...

ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమంతమైన పాలన, నీతివంతమైన పాలన జవాబుదారీతనం ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులకు పాలన యంత్రాగాలు చేతపట్టినప్పటి నుంచి జవాబుదారితనం ఉండాలి. అలా లేకుండా ఎన్నికలు జరిగే వరకు ఒకలాగా ఉండి ఎన్నికలు జరిగిన తర్వాత ప్రజలపై పెత్తనం చెలాయించే దేశం ప్రజాస్వామ్యంలో భవిష్యత్తు ఉండదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు బలమైన పునాది కాబట్టి ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి యువతకి రాజకీయ పార్టీలు ఎంత విరాళాలు అందిస్తున్నాయో కచ్చితంగా తెలియాల్సిన అవసరం ఉంది. అలా చేస్తేనే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ఆర్థిక భవిష్యత్తు నిర్ణయించే అధికారం ప్రజలకే ఉంటుంది. అంతేకానీ ఆవేశంతో అతిశయంతో సుప్రీం ఇచ్చిన తీర్పును ఆషామాషీగా చూడవద్దు. సమూలంగా కింది స్థాయి నుంచి బడ కార్పొరేట్ల వరకు ఎంతెంత విరాళాలు ఇస్తున్నారు కచ్చితంగా కార్యాచరణ దిశగా అడుగులు వేయాలి. అలా విరాళాలు ఎవరెవరిస్తున్నారు తెలిస్తే ఓట్ల కొనుగోలు కాకరమైన ఈ సమస్య సమస్య పోతుంది. ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకోవాలి అంటే అది మన అందరి చేతుల్లో ఉంది దానికి న్యాయస్థానాలే ఊపిరినిస్తాయని దానికి ఇది ఒక చక్కటి ఉదాహరణ....



...కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత

# 28 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

- ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు
- టేకులపల్లి పరీక్షా కేంద్రంలో పరీక్ష రాయనున్న 278 మంది విద్యార్థులు
- పరీక్ష రాయనున్న టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 214
- ప్రశాంతంగా ముగిసిన ప్రాక్టికల్ పరీక్షలు
- ఈనెల 19న మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ పరీక్ష
- వివరాలు వెల్లడించిన టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ కల్పన






**జయభేరి, టేకులపల్లి :**
ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 14 వరకు జరుగుతాయని టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కల్పన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో మొదటి సంవత్సరం 157 ద్వితీయ సంవత్సరం 121 మొత్తం 278 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అర్థగంట ముందే విద్యార్థిని, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రథమ 122 ద్వితీయ 92 మొత్తం 214 మంది విద్యార్థిని విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారని తెలిపారు. ఇప్పటికే ఈనెల 9 నుండి 12వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి, శుక్రవారం ఇంగ్లీష్ ప్రాక్టికల్ ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 19న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి విద్యార్థులకు పర్యావరణ సబ్జెక్టుపై పరీక్ష ఉంటుందని విద్యార్థి, విద్యార్థులు తప్పకుండా హాజరుకావాలని స్పష్టం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకు లోను కాకుండా కష్టపడి ఇష్టంగా చదువుకుని అన్ని పరీక్షలు నిర్భయంగా రాయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చేటప్పుడు ప్యాడ్, పెన్నులు, స్కేలు, హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకుని రావాలని, మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్, బోడు డిజిటల్ వస్తువులు పరీక్షా కేంద్రానికి తీసుకురావద్దని సూచించారు.

# చెరువు సంరక్షణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం

**జయభేరి, మేడిపల్లి :**

హైకోర్టు ఆదేశాల మేరకు రాష్టంలోని వివిధ చెరువుల సంరక్షణ, అభివృద్ధి యొక్క పురోగతిని పరిశీలించేందుకు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా గాడి ప్రవీణ్ కుమార్ మరియు రెవెన్యూ ప్రభుత్వ ప్లీడర్ టి శ్రీకాంత్ రెడ్డి నేతృత్వం లోని కమిటీ సభ్యుల బృందం, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ త్రిళేశ్వర్ రావు కలిసి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు (మినీ ట్యాంక్ బండ్) ను సందర్శించారు. ఈ సందర్బంగా పీర్జాదిగూడ పెద్ద చెరువును మొదటి HMDA నిధులు సుమారు రూ 13.5 కోట్లతో బండ్ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రెండవ దశలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు చెరువు సంరక్షణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసామన్నారు. ప్రజలను వరదముంపు నుండి రక్షించాలనే ఉద్దేశ్యంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా SNDP ద్వారా బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ 110 కోట్లతో





స్ట్రాం వాటర్ డ్రైన్ నిర్మాణం పనులు చేపట్టామని.. పనులు పూర్తయితే చెరువును పూర్తిగా శుద్ధి చేసి డ్రైనేజి నీటిని చెరువులో కలవకుండా చేయడంతో మూసి వద్ద ఏర్పాటు చేసే STP ద్వారా డ్రైనేజి శుద్ధి చేయడం జరుతుందన్నారు. తద్వారా చెరువులో వర్షపు నీరు ఒడిసి పట్టడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే అవకాశం ఉంటుందన్నారు. చెరువుల అభివృద్ధి, సంరక్షణతో పాటు అన్యాక్రాంతం కాకుండా FTL, బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేయడం, అక్రమణలపై తీసునుకోవలసిన చర్యలు మొదలైన అంశాలను పరిశీలించి నివేదికలో పొందు పరచడం జరుగుతుందన్నారు.పీర్జాదిగూడ పెద్ద చెరువు బండ్ యొక్క అభివృద్ధిపై కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో SNDP SE ఆనంద్, DE పవన్, ఇరిగేషన్ DEE ఉషారాణి, AE పరమేష్, పీర్జాదిగూడ కమీషనర్ త్రిళేశ్వర్ రావు, MRO హసీన, నాయకులు అలవాల దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో రసప్తమి

**జయభేరి, దేవరకొండ :**

వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో రసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో రసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాసవి మహిళలు ఆట పాటలతో పాటు రంగవల్లికలు వేసి గెలుపొందిన మహిళలకు ప్రథమ ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్టిక్ ఇన్చార్జ్ లక్కారపు మల్లయ్య, జోన్ చైర్మన్ నీలా సంజీవ కుమార్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తోనుకునూరి విజయ, కార్యదర్శి మంచికంటి పద్మ, కోశాధికారి కుంచకూరి శిరీష, ప్రపంచ ఆర్యవైశ్య మహిళా విభాగ్ అధ్యక్షురాలు చీదల్ల శ్రీదేవి, గుమ్మడవల్లి మహాలక్ష్మి, శిలా చంద్రకళ, కర్నాటి జ్యోతి, కుంచకూరి రవళి, గార్లపాటి లీలావతి, రాచమల్ల శైలజ, గోవిందు శైలజ, పద్మజ దొడ్డి శారద, బెజవాడ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్ ను కలిసి సన్మానం




**జయభేరి, చందంపేట :**

చందంపేట మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో నూతనంగా వచ్చిన తహశీల్దార్ ఎం .శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. మొట్టమొదటిసారిగా కలిసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రమావత్ విజయ నాయక్, సిపిఐ మండల నాయకులు, టీయూడబ్ల్యూజే 143 మండల అధ్యక్షులు వాంకునావత్ సుభాష్ నాయక్, సపావట్ రాజేష్ నాయక్, నేనవత్ పంతులాల్ నాయక్, మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు.

## బీజేపీ కి 6566 కోట్లు.. బీఆర్ఎస్కు 386 కోట్లు..?

**జయభేరి, న్యూఢిల్లీ ఫిబ్రవరి 16:**

ఎన్నికల బాండ్ల ను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే రాజకీయ పార్టీలకు సమర్పించే ఆ బాండ్ల గురించి కొన్ని వివరాలు తెలిశాయి. ఆ బాండ్ల ద్వారా అధికారంలోని బీజేపీ పార్టీకి 6566 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఇచ్చిన తీర్పులో కొన్ని పార్టీల లావాదేవీలు వెల్లడయ్యాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ కన్నా.. బీజేపీకి సుమారు ఆరు రెట్లు అధికంగా ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్కు బాండ్ల రూపంలో కేవలం 1123 కోట్లు మాత్రమే వచ్చాయి. పార్లమెంట్లో పొందిపరిచిన సమాచారం ప్రకారం ఇప్పటి వరకు 16,518 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో ఆయా రాజకీయ పార్టీలకు వచ్చాయి. సుప్రీంకోర్టు తీర్పులో ఆయా పార్టీలకు ఎంత వచ్చిందో తేలింది. బాండ్ల రూపంలో 2017 నుంచి 2023 మధ్య కాలంలో బీజేపీకి సుమారు 6,566 కోట్లు వచ్చాయి. బాండ్ల అందుకున్న పార్టీల్లో టీఎంసీకి 1092 కోట్లు ముట్టాయి. బీజూ జనతాదళ్కు 774 కోట్లు, డీఎంకేకు 616 కోట్లు, బీఆర్ఎస్కు 386 కోట్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్కు 383 కోట్లు, టీడీపీకి 146 కోట్లు, శివసేనకు 101.38 కోట్లు, ఆమ్ ఆద్మీ పార్టీకి 94.28 కోట్లు .. బాండ్ల రూపంలో వచ్చాయి.

# రైతు బంధు రావడం లేదంటూ రైతుల ఆందోళ న

- తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ కు రైతుల విన్నపం
- గతంలో రైతుబంధు వచ్చి ఇపుడు రాకపోవడం ఏంటని ప్రశ్నించిన రైతులు
- ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వినతి



**జయభేరి, ఫిబ్రవరి 16 :**

ధరణిలో నమోదైన భూమికి రైతుబంధు రావడం లేదని శామిర్ పేట్ మండలం లాల్ గడి మలక్ పేట్ చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టా పాసు పుస్తకాలు ఉన్నప్పటికీ తమకు రైతు బంధు రావడం లేదని రైతులు లక్ష్మి పతి, వెంకటేషం, నాగేష్, చంద్రశేఖర్ లు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు శామీర్ పేట్ రెవెన్యు కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 2016లో శామీర్ పేట్ మండలంలోని లాల్ గడి మలక్ పేట్ లోని సర్వే నెంబర్ లు 308, 313, 317, 125, 131, 312 లలో 16.13 గుంటల భూమిని ఒరిజినల్ పట్టాదార్ నుంచి కొనుగోలు చేశామని, దీనికి సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలోని ధరణి వెబ్ సైట్ లో పేర్లు నమోదు చేసుకున్నామని తెలిపారు. కాగా 2019లో మాకు పట్టాదార్ పాసుపుస్తకాలు కూడా వచ్చేసి పలుమార్లు రైతుబంధు కూడ వచ్చిందని చెప్పారు. ఇక 2022 నుంచి మాకు రైతుబంధు రావడం లేదని ఈ విషయమై జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక తహసీల్దార్ కు కూడా వినతిపత్రాలు సమర్పించామన్నారు. అయితే మూడు రోజుల క్రితం రామశేషగిరిరావు అనే వ్యక్తి అదే భూమి తనదంటు ధరణిలో తన పేరు నమోదు చేసుకోవడానికి తహశీల్దార్ కు డబ్బులు ఆశ చూపి అక్రమంగా తమ పేరిట ఉన్న భూమిని రామశేషగిరిరావు పేరుపై మార్చుకోవాలని యత్నించాడని ఆరోపించారు. దీనిపై వివిద పత్రికల్లో ప్రచురించగా జరుగుతున్న అన్యాయాన్ని గ్రహించిన తాము జిల్లా కలెక్టర్ ను సంప్రదించి తమ గోడును విన్నవించామని చెప్పారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మా భూమిపై విచారణ జరిపి తమకు రైతుబంధు ఇప్పించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఎన్నో ఎళ్లుగా నక్ష లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు

- నూతన తహసీల్దార్ ను సన్మానించిన మూడు చింతలపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు
- రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరిన కటికెల వైద్య నాథ్




**జయభేరి, ఫిబ్రవరి 16 :**

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండల నూతన తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన వెంకటనర్సింహారెడ్డిని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, లక్ష్మాపూర్ ఉపసర్పంచ్ కటికెల వైద్యనాథ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం అదేవిధంగా నూతన తహశీల్దార్ ను రెవెన్యూ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కటికెల వైద్యనాథ్ మాట్లాడుతు లక్ష్మాపూర్ గ్రామంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్ ను కోరినట్లు తెలిపారు. ఎన్నో ఎళ్లుగా నక్ష లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , ఈ సమస్యపై దృష్టి సారించాలని తహశీల్దార్ ను కోరగా, దీనిపై స్పందించిన తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతు రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐలు నరేష్, రాఘవ, డిప్యుటి తహశీల్దార్ నాగజ్యోతి, సర్వేయర్ వినోద్ కుమార్, కిసాన్ సెల్ అధ్యక్షుడు గుర్రం బస్వారెడ్డి, కోశాధికారి మర్యాల వీరేషంగుప్త, రెవెన్యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## కులగణన తీర్మానానికి బీఆర్ఎస్ మద్దతు

**జయభేరి, హైదరాబాద్ ఫిబ్రవరి 16**

కులగణన తీర్మానానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపింది.తీర్మానంపై బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. కులగణన పకడ్బంధీగా నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి గంగుల సూచించారు. అదేవిధంగా కులగణనపై తీర్మానం మాత్రమే కాదు చట్టం చేస్తే బాగుంటుందని అన్నారు.భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు రాకుండా కులగణన చట్టం ఉండాలని, ఎలాంటి కోర్టు కేసులకు అవకాశం ఉండకూడదని గంగుల సూచించారు. కులగణన పూర్తికాగానే వెంటనే చట్టం చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కులగణన తర్వాత చట్టం ఎలాంటి పథకాలు అమలు చేయనుందో ముందే చెప్పాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.ఎంబీసీలను మొదటి గుర్తించినదే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని గంగుల చెప్పారు. ఎంబీసీలకు మంత్రి పదవి ఇవ్వాలని సూచించారు. బీసీ సబ్ప్లాన్ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## లక్ష్మాపూర్ గ్రామంలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**జయభేరి, ఫిబ్రవరి 16 :**

మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్యులు పలువురికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఈ నెల 21వ తేదీన ఉచిత బస్సు సౌకర్యం కల్పించి వారికి అవసరమైన కొన్ని రకాల ఎక్స్ రే, స్కానింగ్ ,రక్త పరీక్షలు ,కిడ్నీ పరీక్షలు, లివర్ పరీక్షలు ,మెదడు స్కానింగ్ ,నడుముకి మోకాళ్ళకి ఎమ్మారై స్కానింగ్ , మూత్ర పరీక్షలు, కంటి ఆపరేషన్లు ,గర్భసంచి సంబంధించిన ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామని వారు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, క్యాంపు ఆర్గనైజర్ వెంకట, వైద్యులు, మనోజ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు శ్రీ చెన్నకేశవ స్వామి అనుగ్రహం పొందాలి



**జయభేరి, చింతపల్లి :**

ప్రతి ఒక్కరు శ్రీ చెన్నకేశవ స్వామి అనుగ్రహం పొందాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు. చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో సమైక్య నగర్ శ్రీ చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నక్కనమోని ప్రేమ లత పరమేష్, వార్డు నెంబర్స్ నక్కనమోని శీను,అనంతుల చిన్న మల్లేష్,మాజీ సర్పంచ్ ఆలంపల్లి వెంకటయ్య, రాములు, కూన మహేందర్, జంగయ్య, బిక్షమయ్య, జక్కుల సత్య నారాయణ, బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, జంతి వెంకటరెడ్డి, చింతపల్లి మండల యూత్ శిమర్ల కృష్ణ యాదవ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ లో క్రీడా దుస్తువులు ఇప్పించిన దాత

- తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి




**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలంలోని అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు దేవరకొండలో డివిజన్ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొనుచున్నారు .క్రికెట్ ఆడుతున్న పంచాయితీ కార్యదర్శులందరికి ఈరోజు చింతపల్లి ఎంపిపి శ్రీ కొండూరు భవాని పవన్ కుమార్ చేతులమీదా మరియు క్రీడా దుస్తువులు 13000 వేల రూపాయలతో టీషర్ట్స్ పాయింట్లు ఇప్పించిన దాత తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి చేతుల మీదిగా పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా చింతపల్లి ఎంపిపి శ్రీ కొండూరు భవాని పవన్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి తొడుపడుతాయని కోరారు.క్రీడలలో విజయం సాధించాలని కోరారు.ఈకార్యక్రమంలో తీదేడు మాజీ సర్పంచ్ క్రీడా దుస్తువులు దాత కాయితి జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, మండలంలోని అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు,సాయి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ అదృశ్యం

**జయభేరి, మేడిపల్లి :**



మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి లో ఫోటోగ్రాఫర్ అదృశ్యం. ఈదిగా శంకర్ గౌడ్ తండ్రి గిడ్డయ్య గౌడ్ (59), సేల్స్ మెన్, షాప్ నెంబర్: 03, S.V నక్షత్ర అపార్ట్మెంట్, అన్నపూర్ణ కాలనీ కెనరా నగర్ పీర్జాదిగూడ మేడ్చల్ జిల్లా అను వారికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు సంతానం కలరు. వాళ్ల కొడుకు ఈదుగా పురుషోత్తం గౌడ్ (32), వృత్తి ఫోటోగ్రాఫర్, మా ఇంట్లోనే పద్మ వేణి ఫోటో స్టూడియో పేరుతో ఫోటో స్టూడియో పెట్టుకుని బిజినెస్ చేస్తున్నాడు. రోజు మాదిరిగానే తేదీ 12.02.2024 నాడు సాయంత్రం 5:00 గంటలకు నేను ప్రోగ్రాం చేయడానికి వెళుతున్నాను అని చెప్పి ఒక లాప్టాప్ డ్రెస్ తీసుకొని వెళ్ళినాడు. కానీ ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. తన కొడుకు మొబైల్ నెంబర్ కి కాల్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఇంతవరకు తిరిగి రాకపోవడంతో మేడిపల్లి పిఎస్ కి వచ్చి తన కొడుకు ఆచూకీ లభించడం లేదు అని ఫిర్యాదు చేయడం జరిగింది. తన కొడుకు వివరములు: ఈదిగా పురుషోత్తం గౌడ్ (32), తండ్రి శంకర్ గౌడ్, ఎత్తు 5.0", దుస్తులు తెలుపు... పైన తెలిపిన వ్యక్తి యొక్క వివరములు ఆచూకీ ఎవరికైనా తెలిసినచో ఈ క్రింది నెంబర్లకు 8712579157 / 8172662702 తెలియజేయగలరు.

# సీఎం రేవంత్ రెడ్డిని సన్మానించిన ఎమ్మెల్యే శంకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరుల హర్షం

**జయభేరి, షాద్నగర్ :**

బీసీల కులగనన కోసం తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం పాటుపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా కలుసుకొని సన్మానించారు ఎమ్మెల్యే శంకర్ తోపాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నాల ప్రభాకర్ తదితర ప్రజాప్రతినిధులు ఉన్నారు. తెలంగాణ కోసం గతంలో బీసీ సంఘాలు బడుగు బలహీన వర్గాల నేతలు కోట్లాది కళ్ళతో విధి చూశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొట్టమొదటిసారిగా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శాసనసభలో కులగనల తీర్మానం ప్రవేశపెట్టడం హర్షదాయకమని కొనాడారు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి శాలువాతో సన్మానించారు అనంతరం మంత్రి పున్న ప్రభాకర్ బొకే అందజేశారు.

**సమగ్ర కుటుంబ సర్వే వల్ల ఎవరికి లాభం జరిగింది?**

కులగణన తీర్మానం పై అనుమానం ఉంటే ప్రతిపక్షాలు సూచనలు సలహాలు ఇవ్వాలనీ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. తీర్మానం పై ఏదైనా లీగల్ చిక్కుల పై అంశాలు ప్రతిపక్షాలకు తెలుస్తే తీర్మానం అమలు అయ్యే విధంగా సహకరించాలనీ, తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంతో కులగణన వల్ల అరశాతం ఉన్న వాళ్లకు బాధ ఉంటుందనీ కోట్లాదిమంది ప్రజలకు లాభం జరుగుతున్నప్పుడు హర శాతం నాయకుల పట్టించుకోవాల్సిన పనిలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోపే మంత్రివర్గ ఆమోదంతో సభలో తీర్మానం పెడుతున్నాం అని తెలిపారు. ఈ పదేళ్లు బిఆర్ఎస్ ఏం చేశారో చెప్పాలన్నారు.. ఈ తీర్మానం.. బలహీన వర్గాలను బలంగా తయారు చేయడమే మా ఉద్దేశం అన్నారు. బాధితులుగా ఉన్న వాళ్లను పాలకులుగా చేయాలన్నదే మా ఆలోచన అన్నారు. కులగణనపై అనుమానాలొద్దన్నారు. చట్ట సభల్లో అన్నికులాలకు న్యాయం చేసేందుకే కులగణన అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జస్టిస్ కమిటీ ఏర్పాటు చేశాం అని, సమగ్ర కుటుంబ సర్వే చేశామని



బీఆర్ఎస్ గొప్పగా చెప్పుకుంటుందనీ బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే సభలో ప్రవేశపెట్టారా? అన్నారు. ఎన్నికల కోసమే బీఆర్ఎస్ అప్పుడు ఆ సర్వే వివరాలను వాడుకుందనీ, మాకు రాజకీయ దురుద్దేశాలు లేవు. కులగణనపై అనుమానాలొద్దు అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు.

---



# స్థానికులకు పని కల్పించాలి.. పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

- సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకటయ్య

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలోని పోలేపల్లి నాలుగు మూలల చౌరస్తా కావడంతో చుట్టుపక్కల ప్రాంతంలో అభివృద్ధి చెందడంతో నూతనంగా బిల్డింగులు జోరుగా సాగుతుంది అన్నారు. సెంట్రింగ్ వర్కర్ యూనియన్ అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొండమల్లేపల్లి కి సంబంధించిన ఉప్పర్ మేస్త్రీలు బిల్డర్ గా మారి పోలేపల్లి లో బిల్డింగ్ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు .స్థానికంగా సేవాలాల్ మహారాజ్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ . సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ పోలేపల్లి గ్రామం మండలం చందంపేట జిల్లా నల్లగొండ గా కార్మిక సంఘం రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నామని అన్నారు .స్థానికులకు పని ఇవ్వాలని చందంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు నూతన బిల్డింగ్లో సెంట్రింగ్ పని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు బయటి నుంచి వచ్చి పని చేసుకుని పోతున్నారు కావున మేము స్థానికంగా ఉన్న వాళ్లకు నూతన బిల్డింగ్ ఏర్పాటు చేసుకునే స్థానికులకు పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు సేవ్యా నాయక్.శంకర్ బోడియా. సెంట్రింగ్ యూనియన్ కార్మికులు రవీందర్ .ఎస్.కె లతీఫ్ .జంగయ్య .శ్రీను . పత్య. జగన్. వెంకటయ్య .రమేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# తాగునీటి పరిష్కారం కోసం సొంత ఖర్చుతో రెండు బోర్లు

- మాజీ సర్పంచ్ పార్వతి మకట్లాల్ నాయక్



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండల కేంద్రంలోని బొల్లారం పట్టి గ్రామపంచాయతీలో ట్యాంకర్లతో ఇంటింటికి నీటి సరఫరా చేస్తున్న మాజీ గ్రామ స ర్పంచ్ నేనావత్ పార్వతి మకట్ లాల్ నాయక్ అన్నారు గ్రామంలో రెండు బోర్లు సొంత ఖర్చులతో వేయించడం జరిగింది. బోర్లలో నీళ్లు ఎక్కువ రావడంతో నేటి నుండి నీటి సమస్య పరిష్కారం అవుతుందని వారు తెలిపారు బోర్లు భూగర్భ జలాలు అడగండిపోవడంతో దాంతో ఈనీటి సరఫరా లేకపోవడం అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజల సొంత ఖర్చుతో రెండు బోర్లు వేయించిన బోరులో నీరు ఎక్కువ రావడంతో గ్రామస్తులు సంతోష వ్యక్తం చేశారు. పరిష్కార నిర్మాణం కోసం బొల్లారం పట్టి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల పరిపాలన సాగుతుంది.

---

# సేవాలాల్ జయంతి వేడుకలలో బానోత్ విజయలక్ష్మి



**జయభేరి, ఇల్లందు :**

మసి వాగు తండా ఇల్లందు నియోజకవర్గంలో ఘనంగా జరిగిన సేవాలాల్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న బిజెపి నాయకురాలు బానోత్ విజయలక్ష్మి, ఆనవాయితీగా భోగ్ బండారు చేసి అనంతరం బానోత్ విజయలక్ష్మి గారికి సన్మానం చేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బానోత్ కిషన్ నాయక్ బిజెపి జిల్లా నాయకులు, జరుపుల రామచందర్ బిజెపి మండల ప్రెసిడెంట్ , జరుపల మంగీలాల్, బుక్య నందు నాయక్ సర్పంచ్, బోడ సుమలత MPTC, గుగులోత్ పతియ, తదితరులు నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



---

# మల్లారెడ్డి మహిళా కళాశాలలో టెక్నికల్ సింపోసియం

**జయభేరి, మేడ్చల్ :**



విద్యార్థినులు టెక్నాలజీతో పాటు కమ్యూనికేషన్ స్కిల్ పెంపొందించుకోవాలని హెక్సాగాన్ క్యాపబిలిటి సెంటర్ ఆఫ్ ఇండియా హైదారాబాద్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ కొణిదెన అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నికల్ సింపోజియం కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు చదువుతో పాటు టెక్నికల్ స్కిల్ ఎంతో అవసరం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో తరచు పాల్గొని టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ స్కిల్ పెంచుకోవాలని సూచించారు. అంతేకాక విద్యార్థినులలో కళానైపుణ్యాలను పెంచుకోవడానికి తోడ్పాటు నందిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనం ద్వారా విద్యార్థినుల్లో ఎంటర్ప్రెన్యూర్ స్కిల్స్తో పాటు టీమ్ లీడర్షిప్ నైపుణ్యాలు పెంచుకోవచ్చన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కల్పన, హెచ్ఓడీ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



---



# కుల గణనతో తెలంగాణ లోని అన్ని వర్గాలకు సమ న్యాయం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్

**జయభేరి, మేడిపల్లి :**

తెలంగాణ లోని అన్నివర్గాలకు సమ న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కుల గణన నిర్ణయం అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తుందని టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ మల్కాజిగిరి ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం నాడు తెలంగాణ శాసన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధ్వర్యంలో తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు నేడు శాసన సభలో బిల్లు పాస్ చేయడంతో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం పెరిగిందని అన్నారు.ఈ సందర్భంగా వారిని అసెంబ్లీ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

---

# డిపిఆర్ఓ శ్రీనివాసరావు బదిలీ



**జయభేరి, ఇల్లందు కొత్తగూడెం :**

డిపిఆర్ఓ గా పనిచేస్తున్న శీలం శ్రీనివాసరావును జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ సమాచార శాఖ ప్రత్యేక కమిషన్ హనుమంతరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు బదిలీ అయిన ఎస్ శ్రీనివాసరావు ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల శుక్రవారం సాయంత్రం విధుల నుంచి విడుదల చేశారు. ఎస్ శ్రీనివాసరావు స్థానంలో ఇన్చార్జిగా సహాయ పౌర సంబంధాల అధికారి ఎండి అజ్గర్ హుస్సేన్ ను నియమించారు.

---

# సింగరేణి కొత్త గనులకు పూర్తి సహకారం

- కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా
- బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి పనితీరు భేష్
- సింగరేణి పనితీరుపై సింగరేణి భవన్ లో ఉన్నతస్థాయి సమీక్ష

**జయభేరి, ఇల్లందు సింగరేణి :**




సింగరేణి సంస్థ పనితీరు సంతృప్తికరంగా ఉందని, సంస్థ అభివృద్ధి కోసం చేపట్టనున్న గనులకు పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ అమ్రిత్ లాల్ మీనా హామీ ఇచ్చారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుండటంపై ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఆయన సంస్థ ఛైర్మన్ మరియు ఎండి ఎన్.బలరామ్ ఇతర డైరెక్టర్లతో కంపెనీ ప్రగతి పై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సింగరేణి ప్రస్తుత పనితీరు భవిష్యత్తు ప్రణాళికలపై ఛైర్మన్ ఎన్.బలరామ్ వివరించారు. సింగరేణి ప్రాంతంలోని మూడు బొగ్గు బ్లాకుల కేటాయింపు పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే రానున్న కాలంలో చేపట్టనున్న కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూడాలన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ శాఖ కార్యదర్శి స్పందిస్తూ నిబంధనలకు లోబడి సింగరేణికి మేలు కలిగే విధంగా తగిన సహకారాన్ని అందిస్తామని సింగరేణి భవిష్యత్తుకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని ఆయన హామీ ఇచ్చారు. అలాగే సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సోలార్, థర్మల్ ప్రాజెక్టుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సోలార్ రంగంలో చేపట్టే ప్రాజెక్టులపై కూలంకశంగా తెలుసుకున్నారు. సింగరేణి చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలైన థర్మల్, సోలార్, జియో థర్మల్, ఓబీ నుంచి ఇసుక ఉత్పత్తి, కమర్షియల్ ఇసుక తయారీ తదితర ప్రాజెక్టులపై అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్, సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), శ్రీ ఎన్ వి కె శ్రీనివాస్ (ఆపరేషన్స్ పర్సనల్), వెంకటేశ్వర్ రెడ్డి (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్) జె.ఆల్విన్, జీఎం(కో ఆర్డినేషన్) ఎం.సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో భేటీ**

హైదరాబాద్ సింగరేణి భవన్ లో సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రప్రభుత్వప్రధానకార్యదర్శి శాంతకుమారిని బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఉన్నారు.

---


# పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు 147కోట్ల ఆదాయం

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 16**

తెలంగాణలో పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల చెల్లింపులకు ఇచ్చిన రాయితీ ముగిసింది. గురువారం (ఫిబ్రవరి 15) అర్ధరాత్రితో డిస్కౌంట్ ఆఫర్ గడువు అయిపోయింది. ఈ గడువును ఇప్పటికే రెండుసార్లు పొడిగించారు. మొదట జనవరి 10వతేదీ వరకు సమయం ఇచ్చారు. ఆతరువాత సాంకేతిక సమస్యలు రావడంతో... జనవరి 31 వరకు గడువు పొడిగించారు. ఆ తర్వాత... మరోసారి ఫిబ్రవరి 15 వరకు గడువు పెంచారు. ఇప్పటికే రెండు సార్లు గడువు పెంచిన అధికారులు... ఈసారి మాత్రం గడువు పొడిగించలేదు. ఈ డిస్కౌంట్ ఆఫర్ వల్ల ఖజానాకు 147 కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు పోలీసు అధికారులు. చాలా మంది ఈ ఆఫర్ను వినియోగించుకున్నారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ట్రాఫిక్ చలాన్ల డిస్కౌంట్ ఆఫర్కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వాహనాలను బట్టి 50 నుంచి 90 శాతం వరకు రాయితీ ఇచ్చింది తెలంగాణ ప్రభుత్వం. ద్విచక్ర వాహనాలు...బైక్లు, ఆటోలకు 20 శాతం చలాన్లు చెల్లిస్తే... మిగిలిన 80 శాతం రాయితీ ఇచ్చారు. తేలికపాటి, హెవీ వాహనాలు, కార్లు, జీపులు, భారీ వాహనాలకు 40శాతం చెల్లిస్తే మిగిలిన 60 శాతం మాఫీ చేశారు. ఆర్టీసీ డ్రైవర్లకు.. ట్రాఫిక్ చలాన్లలో 10శాతం చెల్లిస్తే మిగిలిన 90శాతం మాఫీ చేశారు. డిసెంబర్ 25లోపు వాహనాలపై పడిన చలాన్లకు మాత్రమే ఈ రాయితీ వర్తించింది. డిసెంబర్ 26 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు పెండింగ్ చలాన్లపై రాయితీతో చెల్లింపులు జరిగాయి. హైదరాబాద్ నగరంలోని రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్.... మూడు కమిషనరేట్లతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఇతర కమిషనరేట్లు, జిల్లా ప్రధాన కార్యాలయాలతోపాటు అన్నీ ప్రాంతాల్లో... ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు చలాన్లు విధిస్తారు.

---

# నర్సరీ ని పరిశీలించిన ఎంపీడీఓ




**జయభేరి, టేకులపల్లి :**

శుక్రవారం టేకులపల్లి మండలం నందు గల రోల్లపాడు, 9వ మైల్ తండా, బేతంపూడి, గోల్యా తండా గ్రామ పంచాయతీల లో తెలంగాణకు హరితహారం పథకం లో భాగంగా ఏర్పాటుచేసిన నర్సరీలను టేకులపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. రవీంద్రా రావు పరిశీలించడం జరిగింది. ప్రతి నర్సరీలో అన్ని విత్తనాలు మొలకెత్తే విధంగా పెంచాలని, ప్రతిరోజు ఉదయం సాయంత్రం మొక్కలకు నీరు పెట్టాలని, కలుపు లేకుండా చూడాలని సిబ్బంది ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీలక్ష్మి గణేష్ గాంధీ, అదనపు కార్యక్రమ అదికారి కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు శిరీష, కృష్ణకుమారి, మీనా కుమారి, ప్రశాంత్, మరియు సాంకేతిక సహాయకులు చంద్మాల్, సురేష్, క్షేత్ర సహాయకులు భద్రం, భద్రయ్య సరిత పాల్గొన్నారు.

# ఫోర్బ్స్ జాబితాలో రష్మిక.. విజయ్ దేవరకొండ ఫుల్ హ్యాపీ అట..!

తిరుగులేని విజయాలతో దూసుకుపోతున్న కన్నడ సోయగం రష్మిక మందన్న కు అరుదైన గౌరవం దక్కిన విషయం తెలిసిందే. ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ '30 అండర్ అత్యంత ప్రభావశీల వ్యక్తుల జాబితాలో స్థానం దక్కించుకుంది. ఇందులో వివిధ రంగాల్లో విశేషంగా రాణిస్తున్న 30 ఏళ్లలోపున్న ప్రతిభావంతుల్ని తీసుకోగా.. వినోద రంగం నుంచి రష్మిక అగ్ర స్థానాన్ని దక్కించుకుంది. దీంతో రష్మికకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెపై అభిమానులు, నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. రష్మికకు ఇంతటి గుర్తింపు దక్కడంపై టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ తాజాగా స్పందించారు. ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ కవర్ పేజీపై రష్మిక ఉన్న పిక్‌ను ఇన్‌స్టా స్టోరీస్‌లో షేర్ చేస్తూ.. 'నిన్ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేరుకున్నావు. నువ్వు ఇలాగే మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను' అంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం విజయ్ పోస్ట్ అభిమానులను తెగ ఆకట్టుకుంటోంది.





# అప్పుడు సరోజ.. ఇప్పుడు శీలావతి ?

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' తర్వాత అనుష్క నుంచి ఒక్క సినిమా కూడా రాలేదు. కథల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరించడమే ఈ జాప్యానికి కారణం అని తెలుస్తున్నది. ఎట్టకేలకు స్వీటీ ఓ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. కథను ఓకే చేయడమేకాక, గప్‌చిప్‌గా షూటింగ్ కూడా కానిచ్చేస్తున్నది. ఇంతకీ ఆ సినిమా ఏంటా! అనుకుంటున్నారా? అనుష్కతో 'వేదం' లాంటి గొప్ప సినిమాను తెరకెక్కించిన క్రిష్ దర్శకత్వంలో మళ్లీ ఓ సినిమా చేస్తున్నది అనుష్క. ఈ సినిమాకు 'శీలావతి' అనే ఆసక్తికరమైన టైటిల్ ఖరారు చేసినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నిజానికి 'శీలావతి' అంటే ఓ రకం చేప పేరు. మరి ఈ సినిమాకు ఆ పేరు పెట్టడానికి గల కారణం ఏంటి? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. 'వేదం'లో అనుష్క పోషించిన సరోజ పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది, రానున్న ఈ 'శీలావతి' కూడా ఆమె కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది అని యూనిట్ సభ్యులు అంటున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతున్నట్టు టాక్. సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు. క్రిష్, సాయిమాధవ్ కలయికలో వచ్చిన కృష్ణంవందేజగద్గురుమ్, కంచె, గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రాలు ఎంతటి విజయాలను అందుకున్నాయో తెలిసిందే. వాటికి ఏ మాత్రం తగ్గని సామాజికస్పృహతో కూడిన ఇతివృత్తంతో ఈ సినిమా రూపొందుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతున్నది.

# హాలీవుడ్ రేంజ్‌కి తగ్గేలా లేదు..

బాహుబలి సిరీస్, ఆర్ఆర్ఆర్‌ల తర్వాత రాజమౌళి పంథా మార్చారు. మారిన ఇమేజ్‌నూ, మార్కెట్‌నూ దృష్టిలోపెట్టుకొని, స్థాయికి తగ్గట్టు అడుగులు వేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. మహేశ్‌బాబుతో ఆయన రూపొందించనున్న సినిమాకు సంబంధించి ప్రతి విషయంలోనూ ఆచితూచి అడుగులేస్తున్నారట దర్శకధీరుడు. ఈ సినిమా స్క్రిప్ట్‌వర్క్ ఇప్పటికే పూర్తికావచ్చిందని సమాచారం. ఇక అధికారికంగా ప్రకటించి, షూటింగ్ మొదలపెట్టడమే తరువాయి. దీనికోసం అమెరికాకు చెందిన ఓ క్యాస్టింగ్ ఏజెన్సీతో రాజమౌళి చర్చలు జరిపారన్నది తాజా వార్త. అలాగే ఇందులోని పాత్రధారుల విషయంలోనూ రకరకాల పేర్లు వినిపిస్తున్నాయి. కథానాయికగా ఇండోనేషియాకు చెందిన చెల్సియా ఎలిజబెత్ ఇస్తాన్ నటించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. అలాగే ప్రముఖ హాలీవుడ్ నటుడు క్రిస్ హెమ్‌స్వర్త్ కీలక పాత్ర పోషించనున్నట్టు తెలిసింది. సాంకేతిక నిపుణుల విషయంలో కూడా గతానికి భిన్నంగా అడుగులేస్తున్నారు రాజమౌళి. ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పి.ఎస్.వినోద్, వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా ఆర్.సి.కమల్ కణ్ణన్, ప్రొడక్షన్ డిజైనర్‌గా మోహన్ బింగి, ఎడిటర్‌గా తంబిరాజు వ్యవహరించనున్నారని ఫిల్మ్ వర్గాల టాక్. 'ఎస్ఎస్ఎంబీ29' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపొందనున్నట్టు గతంలో వార్తలు రాగా, దాన్ని తొలగించి 'ఎస్ఎస్ఆర్ఎంబీ' అనే వర్కింగ్ టైటిల్‌ని ఖరారు చేసినట్టు సినీవర్గాలు చెబుతున్నాయి. వ్యాపారపరంగా రాజమౌళీ ఇమేజ్‌ని కూడా దృష్టిలోపెట్టుకొని, మహేశ్, రాజమౌళి ఇద్దరి పేర్లు కలిసివచ్చేలా వర్కింగ్ టైటిల్‌లో మార్పులు చేశారట. ఇక ఈ సినిమాకు 'మహారాజ్' అనే పేరును రాజమౌళి పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ టైటిల్‌పై ఒక్కొక్కరి స్పందన ఒక్కోలావుంది. మరి ఇందులోని నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.



# రకుల్ ఇంట పెళ్లి సందడి షురూ..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ నటుడు జాకీ భగ్నానీ ని రకుల్ ఈ నెల 21న గోవాలో పెళ్లి చేసుకోబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా వీరి ఇంట పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి ప్రీ వెడ్డింగ్ వేడుకలను నిర్వహించారు. భగ్నానీ ఇంట్లో నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురు సెలబ్రిటీలు పాల్గొని సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీతో తాను రిలేషన్‌లో ఉన్నానంటూ రకుల్ ప్రీత్ సింగ్ 2021లో ప్రకటించిన విషయం తెలిసిందే. కొంతకాలంగా ప్రేమలో ఉన్న వీరిద్దరూ.. ఫిబ్రవరి 21న ఒక్కటి కాబోతున్నారు. గోవాలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో కుటుంబసభ్యులు, స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో ఈ జంట వివాహం చేసుకోబోతోంది. ఇక రకుల్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం హిందీలో మేరీ పత్నీ కా రీమేక్‌లో నటిస్తోంది. ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. మరోవైపు తమిళంలో తెరకెక్కుతున్న ఇండియన్ 2 సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తోంది. రకుల్ తెలుగులో చివరగా 2021లో వచ్చిన కొండపొలంలో నటించింది.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com